క్లుప్తంగా

ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసిన అలుగుబెల్లి


రేవంత్‌రెడ్డితో అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి

గరిడేపల్లి : తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డిని మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో తన మిత్రబృందంతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో రెడ్డి హాస్టల్ ఉన్న సమయంలో తనకు స్నేహితుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి నేడు ముఖ్యమంత్రి కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రేవంతర్‌రెడ్డి రాష్ట్ర ప్రజల గుండెల్లో నిలిచిపోయే విధంగా పాలన అందించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఛత్రునాయక్

గరిడేపల్లి : విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ ఛత్రునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం బోధించే ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గణిత ఉపాధ్యాయులకు వృత్తిపరమైన మెళకువలను వివరించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ వెంకట్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయులు గోవిందయ్య, భాగ్యలక్ష్మి, రమ, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

మఠంపల్లి : ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల తనిఖీలు పారదర్శకంగా చేపట్టాలని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో 2022 జనవరి నుంచి 2023 మార్చి నెల వరకు చేపట్టిన పనులపై తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ మామిడి జానకిరాములు, ఏపీఓ ఉమాదేవి, ఎస్‌ఆర్‌పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావ్‌పూలే ప్రజాభవన్‌గా పేరుమార్పు హర్షణీయం

మఠంపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగతిభవన్‌కు జ్యోతిరావ్‌పూలే ప్రజాభవన్‌గా పేరు మార్చడం హర్షణీయమని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం ఆయన మఠంపల్లిలో మండల సీపీఐ కార్యదర్శి అమరారావు పున్నయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో నిత్యం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రజాభవన్‌లో ప్రజాదర్బార్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. అదేవిధంగా ప్రగతిభవన్ చుట్టూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంచెను తొలగించడం కూడా సంతోషించదగ్గ విషయమన్నారు. ఆయన వెంట నాయకులు దాశరథి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యం

కోదాడరూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు తగిన గౌరవం, ప్రాధాన్యం లభిస్తుందని జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడంతోనే మంత్రి వర్గంలో ఇద్దరు మహిళలకు చోటు దక్కడంతో పాటు నేటి నుంచి మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. అదే విధంగా ప్రజాదర్బార్‌తో ప్రజా సమస్యలు పరిష్కారానికి సీఎం శ్రీకారం చుట్టారని తెలిపారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మేళ్లచెరువు : తుపాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు కోరారు. శుక్రవారం మండలంలో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పంటలు చేతికి వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్‌పై కాంగ్రెస్ నజర్

- చైర్‌పర్సన్ పదవిని కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు
- అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ కౌన్సిలర్ల రహస్య సమావేశం
- జనవరిలో పూర్తికానున్న నాలుగు సంవత్సరాల కాలపరిమితి


కోదాడ మున్సిపల్ కార్యాలయం

కోదాడ : కోదాడ మున్సిపాలిటీలో ముసలం ప్రారంభమైంది. బీఆర్‌ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పదవిని కైవసం చేసుకోవడానికి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు తీవ్ర ప్రయత్నాలు మొదలు పెట్టారు. వచ్చే నెల మొదటివారంలో నాలుగు సంవత్సరాల కాలపరిమితి తీరడంతో అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లభిస్తుంది. ఈమేరకు రెండు రోజులుగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లతో పాటు ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు కోదాడలో అదే పార్టీకి చెందిన పద్మావతిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో జోష్ మీద ఉన్న కాంగ్రెస్ నాయకులు కోదాడ నియోజకవర్గంలో అతిముఖ్యమైన మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని చేజిక్కించుకోవడానికి గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు.

16కు పడిపోయిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల సంఖ్య

కోదాడ మున్సిపాలిటీలో 35 కౌన్సిల్ స్థానాలు ఉన్నాయి. వీటిలో 25 స్థానాలను బీఆర్‌ఎస్, 8 స్థానాలను కాంగ్రెస్, ఒక స్థానం టీడీపీ, ఒకస్థానం సీపీఐ గెలుచుకున్నాయి. రెండు సంవత్సరాల క్రితం బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఒకరు మరణించడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. కోదాడ మున్సిపల్ చైర్మన్ పదవి ఓసీ మహిళకు రిజర్వు అయినప్పటికీ నాటి పరిస్థితుల్లో బీసీ మహిళ అయిన వనపర్తి శిరీష చైర్మన్ పదవిని దక్కించుకున్నారు. రెండు సంవత్సరాలు పూర్తి కాకముందే చైర్‌పర్సన్‌కు, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మధ్య తీవ్ర విభేదాలు వచ్చాయి. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు అసమ్మతి శిబిరంలో ఉన్న చైర్‌పర్సన్, ఆమె భర్తను మాజీ మంత్రి కేటీఆర్ పిలిచి సర్ది చెప్పడంతో బీఆర్‌ఎస్ పార్టీలోనే ఆమె కొనసాగుతున్నారు. ఇదే సమయంలో బీఆర్‌ఎస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు, టీడీపీ కౌన్సిలరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీపీఐ కౌన్సిలరు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారు. దీంతో కాంగ్రెస్ బలం 18కి పెరగగా, బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల సంఖ్య 16కు పడిపోయింది. ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా కోదాడ ఎమ్మెల్యే ఓటు కూడా ఉండడంతో సులువుగా అవిశ్వాస తీర్మానం నెగ్గుతామని ఆ పార్టీ కౌన్సిలర్లు అంటున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం పెడితే పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబుతున్నారు.

పాతవారికే ప్రాధాన్యం ఇవ్వాలని..

మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కొల్లా లక్ష్మీప్రసన్నను ప్రకటించారు. కానీ బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ పీఠాన్ని దక్కించుకోవడంతో కాంగ్రెస్ ప్రతిపక్షానికే పరిమితమైంది. తాజా పరిణామాలతో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన వారికంటే పాతవారికే ప్రాధాన్యం ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నట్లు సమాచారం. కేవలం సంవత్సరం మాత్రమే కాల పరిమితి ఉండడంతో పాతవారికే అవకాశం ఇవ్వడం సబబుగా ఉంటుందని ఆపార్టీ కౌన్సిలర్లు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల హడావుడి పూర్తికాగానే దీనిపై మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కోదాడ రాజకీయ పరిస్థితులు వేగంగా మారే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

జీపీల్లో నిధులుంటేనే పనులు చేపట్టాలి


ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న లావణ్య, పక్కన ఎంపీపీ తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామ పంచాయతీల్లో నిధులు ఉంటేనే అభివృద్ధి పనులు చేపట్టాలని, జీపీల్లో ఉన్న నిధులను బట్టి అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని సర్పంచ్‌లకు ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీపీల్లో నిధులు అందుబాటులో లేకపోయినా ఆయా గ్రామాల సర్పంచ్‌లు పనులు చేసి సంబంధిత బిల్లులు చెల్లించాలని కార్యదర్శులపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. తాగు నీటి విద్యుత్ మోటార్ల మరమ్మతులకు ఎక్కువ నిధులు డ్రా చేస్తున్నారని అన్నారు. నూతన ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమష్టిగా పని చేయాలని కోరారు. అనంతరం ఉపాధి హామీ పనులు, పశువుల కొట్టాలకు సంబంధించిన పనులు, పారిశుద్ధ్య పనులపై సమీక్ష నిర్వహించారు. కాగా, ఎంపీడీఓ శాంతకుమారి అడిషనల్ డీఆర్డీఓగా బదిలీపై మహబూబాబాద్‌కు వెళ్లడంతో ఎంపీఓ లావణ్యకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆమెకు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ నర్సిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ, ఏపీఓ శైలజ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేసిన ముక్కంటి

హుజూర్‌నగర్ : రక్తదానం ప్రాణదానంతో సమానం అని డీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బాబూరావు అన్నారు. శుక్రవారం మఠంపల్లి మండలం చౌటపల్లికి చెందిన నాగమణికి డీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మేళ్లచెరువు ముక్కంటి బీ పాజిటివ్ రక్తం దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మానవత్వంతో రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పి.నరసింహారావు, పి.బాలు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత గల వ్యక్తి యతిపతిరావు


హెచ్‌ఎం యతిపతిరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : విధి నిర్వహణలో నిబద్ధత గల వ్యక్తి యతిపతిరావు అని రిటైర్డు ఎంఈఓ ఎండీ దేవదానం అన్నారు. హుజూర్‌నగర్‌లోని ఎన్‌ఎస్‌పీ క్యాంప్ ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘకాలం హెచ్‌ఎంగా పని చేసి బదిలీ అయిన హెచ్‌ఎం యతిపతిరావుకు శుక్రవారం ఆ పాఠశాలలో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం దేవదానం మాట్లాడుతూ యతిపతిరావు అనేకమంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించారని అన్నారు. గత పదేళ్లుగా ఈ పాఠశాలను జిల్లా స్థాయిలో పేరొందిన ప్రాథమిక పాఠశాలగా తీర్చిదిద్దారని చెప్పారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని పాఠశాలల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం రాధదుర్గ, హెచ్‌ఎంలు ఎస్.సైదులు, జి.లింగారెడ్డి, ఉపాధ్యాయులు పుతిలి, విజయలక్ష్మి, లక్ష్మీకాంత్, అరుణకుమారి, హైమవతి, శాంతి, శివయ్య, అనిత, వి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయడం హర్షణీయం


మిఠాయిలు తినిపించుకుంటున్న ఉద్యమకారులు

హుజూర్‌నగర్ : మలిదశ తెలంగాణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని పలువురు ఉద్యమకారులు అన్నారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని ఇందిరా సెంటర్‌లో పలువురు ఉద్యమకారులు సంబరాలు జరుపుకుని మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో తెలంగాణ ఉద్యమకారులందరిలో నూతన ఉత్సాహం వచ్చిందని అన్నారు. కేసులు ఎత్తివేయడం సీఎం ఉద్యమకారుల పట్ల చూపిస్తున్న ప్రేమాభిమానలకు తార్కాణమని అది సువర్ణ అక్షరాలతో లిఖించే విషయమన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు కేఎల్‌ఎన్ రావు, యడ్ల విజయ్, ఎస్‌కే లతీఫ్, దుండిగల నారాయణ, శీలం వీరయ్య, చిలకరాజు సైదులు, దగ్గుపాటి బాబురావు, మార్క్స్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు నాటాలి

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో నాణ్యమైన విత్తనాలు నాటాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బాలెంల, ఎర్కారం, జాటోతుతండా, రామారం గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సంచుల్లో నాటిన విత్తనాలు నుంచి మొక్క ఏపుగా ఎదగడానికి క్రమం తప్పకుండా నీటిని పట్టించాలన్నారు. ఆయన వెంట ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

కోదాడఅర్బన్ : తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు శనివారం మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే అవకాశం కల్పిస్తున్నట్లు కోదాడ డిపో మేనేజర్ దేవులపల్లి శ్రీహర్ష శుక్రవారం తెలిపారు. మహిళలు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించవచ్చని తెలిపారు. మహిళలతో పాటు ట్రాన్స్ జెండర్స్‌కు కూడా ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతరాష్ట్ర సర్వీసులలో తెలంగాణ సరిహద్దుల వరకు ప్రయాణం చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. మహిళలు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గిరిబాబు మృతి తీరని లోటు


గిరిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు బాచిమంచి గిరిబాబు మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం గిరిబాబు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో న్యాయవాది ఎన్ఎస్ఆర్, రామకృష్ణ, కేవీఎస్ మూర్తి, కాంగ్రెస్ నాయకులు గల్లా వెంకటేశ్వర్లు, ఐల వెంకన్న, కె.యోహాన్, వై.వీరబాబు, ఎస్‌కే.సైదా, వి.కృష్ణ, ఎల్.నాగేశ్వరరావు, కె.సైదులు, ఎం.కాశయ్య, ఎం.ముక్కంటి, కె.పుల్లయ్య, బుచ్చయ్య, మిత్రులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం


మునగాల : అన్నదానం చేస్తున్న దాతలు


కోదాడఅర్బన్ : అన్నప్రసాదాన్ని తీసుకొస్తున్న దాత దంతాల నాగయ్య

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. అన్నదానానికి మునగాలకు చెందిన దేవినేని కనకదుర్గ, గంధం అంకంరావు -సునీత దంపతులు, దేవరం యుగంధర్‌రెడ్డి, బరాఖత్‌గూడెంకు చెందిన పోలీస్ అధికారి గడ్డం కాశీం, నాగుల మల్లేష్ -సరస్వతి దంపతులు సహకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు, తంగెళ్ల సాంబ, బొబ్బిలి సంజీవరెడ్డి, కొమ్ము ఈదారావు, గాయం శ్రీనివాసరెడ్డి, అక్కినేపల్లి శ్రీనివాస్, జల్లా రాంబాబు, జెల్లా పెద్ద వీరస్వామి పాల్గొన్నారు.

అయ్యప్ప సన్నిధానంలో..

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో దాత చల్లా నాగేశ్వరరావు కుటుంబసభ్యులు మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 500 మంది మాలధారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, గడ్డం సూర్యారెడ్డి, బర్మావత్ సీతారాంసింగ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో..

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో మాలధారులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తి శుక్రవారం తెలిపారు. కోదాడకు చెందిన బచ్చు లక్ష్మీనర్సింహారావు పుట్టినరోజు సందర్భంగా ఆయన కుటుంబీకులు కాశీవిశ్వనాథం, వెంకటలక్ష్మి, వెంకట అనూష, నందిని, వెంకటరామయ్య దాతృత్వంతో ఈ అన్నదానం నిర్వహించారు. దంతాల నాగయ్య కూడా సహకరించారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామనాథం, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు


హుజూర్‌నగర్ : మంత్రి ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు


మఠంపల్లి : శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర నూతన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హుజూర్‌నగర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సత్కారం

మఠంపల్లి : మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మఠంపల్లి మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాబునాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించా రు. మండలంలోని గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేయాలని కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోతీలాల్, బానోతు బాబు, తదితరులు ఉన్నారు.

ఉత్తమ్‌ను కలిసిన చిలుకూరు నాయకులు

చిలుకూరు : హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం చిలుకూరు మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి మంత్రి ఉత్తమ్ కృషి చేస్తానని అన్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

ఉత్తమ్, పద్మావతిలకు శుభాకాంక్షలు

అనంతగిరి : హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా భారీ మెజార్టీతో గెలుపొందిన ఉత్తమ్‌కుమారెడ్డి, పద్మావతిరెడ్డి దంపతులను అనంతగిరి మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవి కేటాయించడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బుర్ర సుధారాణిపుల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, గునుకుల గోపాల్‌రెడ్డి, బాణోతు బాబునాయక్, ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, గునుకుల స్వరూపారెడ్డి, కుమ్మరి గురవయ్య, షేక్ కబీరు, ముస్కు మధుసూదన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగులమీరా, కిరణ్‌రెడ్డి, నెల్లూరి వినయ్, ఆశోక్, రవినాయక్, కంటు గోపి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.


చిలుకూరు : ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


అనంతగిరి : పద్మావతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముస్కు శ్రీనివాసరెడ్డి, తదితరులు


అనంతగిరి : ఉత్తమ్‌ను శాలువాతో సత్కరిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి

ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవితో అభివృద్ధి

కోదాడరూరల్ : హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవి రావడం పట్ల కాంగ్రెస్ పార్టీ కోదాడ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, రామలక్ష్మీపురం మాజీ సర్పంచ్ కొప్పుల శ్రీనివాసరెడ్డి శుక్రవారం వేర్వేరు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ్‌కు మంత్రి పదవితో రాష్ట్రంతో పాటు కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలు మరింత అభివృద్ధి చెందనున్నాయని పేర్కొన్నారు.

ఉత్తమ్‌కు మంత్రి పదవి కేటాయింపుపై హర్షం

నడిగూడెం : హుజూర్‌నగర్ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవి కేటాయించడంతో పాటు, కోదాడ ఎమ్మెల్యేగా పద్మావతి గెలుపు పట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కన్నా కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరగబోతుందన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్ ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హుజూర్‌నగర్ : పట్టణంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయ 14వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. నీరాజన మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఎం కృషి


మఠంపల్లిలో మాట్లాడుతున్న పాండునాయక్

మఠంపల్లి : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పాండునాయక్ అన్నారు. శుక్రవారం మఠంపల్లిలో జరిగిన పార్టీ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 25వ తేదీ వరకు పార్టీ సభ్యత్వాలు పూర్తిచేయాలని తీర్మానించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బాలునాయక్, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రాము, రన్‌మియా తదితరులు ఉన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతాలు


హుజూర్‌నగర్ : శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయంలో వ్రతంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ : కార్తీకమాసాన్ని పురస్కరించుకొని హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీభీమలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పూలదండలతో అలంకరించారు. సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం తదుపరి రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కోటి ఒత్తులతో దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి, పూజారి, పాలక మండలి చైర్మన్, ధర్మకర్తలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

రామాలయంలో సామూహిక వ్రతాలు

నడిగూడెం : కార్తీక మాసం సందర్భంగా మండల కేంద్రంలోని రామాలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారి వరదాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బూరుగడ్డలో బహుళ ఏకాదశి పూజలు


కార్తీక పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : కార్తీకమాసం సందర్భంగా మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం బహుళ ఏకాదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, అలంకరణ, పంచామృతాలతో అభిషేకం, గంధ సింధూరం, పానకం, వడపప్పు, పండ్లు, పులిహోర, వడమాల, ఆకుపూజ, మంగళాశాసనం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గందు సైదులు, కార్యనిర్వాహణాధికారి ఎంపి లక్ష్మణరావు, రామచంద్రయ్య-నాగమణి, రవితేజకీర్తి, అర్చకులు ముదుంబై హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, గోవిందరెడ్డి, కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

దర్గా వద్ద ప్రత్యేక వైద్యశిబిరం

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని హజ్రత్‌ఖాజా నసీరుద్దీన్ బాబా దర్గా వద్ద శుక్రవారం అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉర్సుకు వచ్చిన భక్తులకు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది జి.వాణి, వై.దుర్గమ్మ, ఎం.గిరిజ, బి.శ్వేత, ఎ.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

చలిగాలులతో ఉక్కిరిబిక్కిరి

అర్వపల్లి : మిచాంగ్ తుపాను ప్రభావంతో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. దీంతో వాతావరణం చల్లబడింది. దీంతో తెల్లవారుజామున చలి తీవ్రత పెరుగుతుంది. పగటి వేళల్లో కూడా చలిగాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు ఇళ్లు వదిలి బయటికి రావాలంటేనే భయపడుతున్నారు. ఈ చలి నుంచి ఇళ్ల ఆవరణలో, రోడ్లపైన చలి మంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు.